వరల్డ్‌కప్ 2023

నేటి మ్యాచ్
భారత్ X ఇంగ్లండ్
మ. 2.00 నుంచి
వేదిక: లక్నో

పారా క్రీడల్లో పరాక్రమం

111 పతకాలతో సరికొత్త రికార్డు • ఆసియా పారా గేమ్స్

హాంగ్జౌ : ప్రతిష్ఠాత్మక నాలుగో పారా ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. నభూతో నభవిష్యత్ అన్న రీతిలో 111 పతకాలతో భారత క్రీడా యవనికపై అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించి ముప్పన్నెల జెండాను రెపరెపలాడించారు. చైనాలోని హాంగ్జౌలో శనివారం మన అథ్లెట్లు సంచలన ప్రదర్శనతో పతకాల సంఖ్య వంద మార్క్ దాటింది. ఈసారి రికార్డు స్థాయిలో 29 బంగారు, 31 వెండి, 51 కాంస్య పతకాలు నెగ్గడంతో భారత్ ఐదో స్థానంలో నిలిచింది.

రికార్డులు ఇవే

1. పారా ఆసియా క్రీడల చరిత్రలో 111 పతకాలు గెలవడం రికార్డు మాత్రమే కాదు భారత అథ్లెట్లకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2014 పారా క్రీడలతో పోల్చితే ఈసారి మూడు రెట్లు పతకాలు గెలవడం విశేషం.

2. పతకాల పట్టికలో భారత్ ఐదో స్థానంలో నిలవడం ఇదే మొదటిసారి. 2014లో తొలిసారి నిర్వహించిన పారా ఆసియా క్రీడల్లో భారత్ 15వ స్థానంతో సరిపెట్టుకుంది.

3. 2014లో మూడు స్వర్ణాలతో పోల్చితే.. భారత అథ్లెట్లు ఈ ఏడాది దాదాపు పదింతలు ఎక్కువ(29) పసిడి పతకాలు కొల్లగొట్టారు.

గోవా వేదికగా జరుగుతున్న నేషనల్ గేమ్స్‌లో బాస్కెట్‌బాల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ మహిళల టీమ్. ప్రస్తుతం తెలంగాణ 7 పతకాలతో 15వ స్థానంలో కొనసాగుతున్నది

ధర్మశాలలో ధమాకా

ఆసీస్ 388 ఆలౌట్, కివీస్ 383/9

ఇరు జట్లు కలిపి 771 పరుగులు

పరుగుల వరద, జడివాన, సునామీ కాదు.. ధర్మశాలలో ఏకంగా ఉల్కాపాతం సంభవించింది!

- న్యూజిలాండ్‌పై ఆస్ట్రేలియా జయభేరి
- హెడ్ సెంచరీ.. వార్నర్ మెరుపులు
- రచిన్ రవీంద్ర శతకం వృథా

హిమాలయ పర్వత సానువుల్లో కంగారూలు పూనకం వచ్చినట్లు ఊగిపోయారు. ఓ వైపు వార్నర్ వాయిస్తుంటే.. మరో ఎండ్ నుంచి ట్రావిస్ హెడ్ శివతాండవ మాడాడు. వీరి జోరుకు ధర్మశాల మౌన సాక్షిగా నిలువగా.. చివర్లో మ్యాక్స్‌వెల్, ఇంగ్లిస్, కమిన్స్ ప్రతి బంతికి సిక్సర్ కొట్టడమే తమ లక్ష్యం అన్నట్లు రెచ్చిపోయారు. ఫలితంగా ఆసీస్ భారీ స్కోరు చేసి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటే.. ఆ తర్వాత అరాచకానికి అర్థం మార్చుతూ.. కివీస్ బ్యాటర్లు ఊచకోత కోశారు! రచిన్ రవీంద్ర రికార్డు సెంచరీకి నీషమ్ దంచుడు తోడవడంతో కంగారూల గుండెల్లో రైళ్లు పరిగెత్తినా.. చివర్లో ఒత్తిడికి చిత్తైన కివీస్ పరాజయంతోనే సరిపెట్టుకుంది. ఇరు జట్లు కలిసి 771 పరుగులు చేసిన ఈ మ్యాచ్‌లో గెలిచింది ఎవరైనా.. అభిమానులకు మాత్రం పైసా వసూల్ ప్రదర్శన చూసే చాన్స్ దక్కింది!

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జోరు కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆసీస్.. ఆ తర్వాత వరుసగా నాలుగో విజయంతో సెమీఫైనల్ బెర్త్‌కు మరింత చేరువైంది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో ఆస్ట్రేలియా 5 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. అసలు క్రికెట్ ఇలా కూడా ఆడుతారా అన్నట్లు ఇరు జట్లు సాగించిన విధ్వంసకాండకు ధర్మశాల స్టేడియం మోతెక్కిపోయింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా.. 49.2 ఓవర్లలో 388 పరుగులకు ఆలౌటైంది. గాయం నుంచి కోలుకొని వచ్చిన ఓపెనర్ ట్రావిస్ హెడ్ (67 బంతుల్లో 109; 10 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపు శతకంతో చెలరేగితే.. డేవిడ్ వార్నర్ (65 బంతుల్లో 81; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) ఫామ్ కొనసాగించాడు. మిషెల్ మార్ష్ (36), స్మిత్ (18), లబుషేన్ (18) తలా కొన్ని పరుగులు చేయగా.. గత మ్యాచ్ సెంచరీ హీరో మ్యాక్స్‌వెల్ (24 బంతుల్లో 41; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), ఇంగ్లిస్ (28 బంతుల్లో 38; 4 ఫోర్లు, ఒక సిక్సర్), కమిన్స్ (14 బంతుల్లో 37; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. కివీస్ బౌలర్లలో ఫిలిప్స్, బౌల్ట్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 383 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (89 బంతుల్లో 116; 9 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ తన పేరిట రాసుకోగా.. డారిల్ మిషెల్ (54), నీషమ్ (39 బంతుల్లో 58; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో జాంపా 3, కమిన్స్, హజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు: **ఆస్ట్రేలియా:** 49.2 ఓవర్లలో 388 (హెడ్ 109, వార్నర్ 81; ఫిలిప్స్ 3/37, బౌల్ట్ 3/77), **న్యూజిలాండ్:** 50 ఓవర్లలో 383/9 (రచిన్ 116, నీషమ్ 58; జాంపా 3/74).

ఆఖరి ఓవర్ సాగిందిలా..

చివరి ఓవర్‌లో న్యూజిలాండ్ విజయానికి 19 పరుగులు అవసరం కాగా.. అప్పటికే అర్ధశతకం సాధించిన నీషమ్ చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. తొలి బంతికి సింగిల్ రాగా.. రెండో బాల్ వైడ్‌కు బౌండ్రీ వెళ్లింది. తిరిగి స్టార్క్ రెండో బంతి వేయగా.. దానికి రెండు పరుగులు వచ్చాయి. ఆ తర్వాత మరో రెండు బంతులకు కూడా సేమ్ సీన్ రిపీటైంది. దీంతో కివీస్ లక్ష్యం 2 బంతుల్లో ఏడు పరుగులకు చేరింది. ఒక్క భారీ షాట్ కొట్టిన కివీస్ గెలువడం ఖాయమే అనుకుంటే.. అది సాధ్యపడకపోగా.. తిరిగి స్ట్రయికింగ్‌లోకి రావాలని ప్రయత్నించిన నీషమ్ రనౌట్ అయ్యాడు. దీంతో న్యూజిలాండ్ ఆశలు ఆవిరయ్యాయి.

1, 4+వైడ్, 2, 2, 2, 1+వికెట్, 0

1 వన్డే ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు (771) నమోదైన పోరు ఇదే. గతంలో ఈ రికార్డు దక్షిణాఫ్రికా-శ్రీలంక (754) పేరిట ఉంది.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
దక్షిణాఫ్రికా	6	5	1	+2.03	10
భారత్	5	5	0	+1.35	10
న్యూజిలాండ్	6	4	2	+1.23	8
ఆస్ట్రేలియా	6	4	2	+0.97	8
శ్రీలంక	5	2	3	-0.20	4
పాకిస్థాన్	6	2	4	-0.38	4
అఫ్గానిస్థాన్	5	2	3	-0.96	4
నెదర్లాండ్స్	6	2	4	-1.27	4
బంగ్లాదేశ్	6	1	5	-1.33	2
ఇంగ్లండ్	5	1	4	-1.63	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఢీ

ఎదురుందా!

ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన జట్టు ఓ వైపు.. ఐదింట ఒక్కటి మాత్రమే నెగ్గిన టీమ్ మరోవైపు! సొంతగడ్డపై పుల్ జోష్‌లో ఉన్న గ్యాంగ్ ఒకటైతే.. డిఫెండింగ్ చాంపియన్‌గా దిగి సత్తాచాటలేక పోతున్న దీన స్థితి మరొకరది!!ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్‌తో టీమ్‌ఇండియా అమీతుమీకి సిద్ధమైంది. వరుస విజయాల జోరులో ఉన్న రోహిత్ సేనను ఇంగ్లిష్ టీమ్ ఏ మేరకు పోటీనిస్తుందో చూడాలి!

లక్నో: పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు సిక్సర్ కొట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గిన రోహిత్ సేన ఆదివారం ఇంగ్లండ్‌తో తలపడనుంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోవడం తప్ప భారత జట్టుకు పెద్దగా సమస్యలేమీ లేకపోగా.. ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్ మాత్రం గాడిన పడేందుకు నానా తంటాలు పడుతున్నది. 2019 ప్రపంచకప్ లీగ్ దశలో భారత్ ఓడిన ఏకైక మ్యాచ్ ఇంగ్లండ్ చేతిలోనే కాగా.. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. రోహిత్, గిల్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, సూర్యకుమార్, జడేజాతో మన బ్యాటింగ్ లైనప్ శత్రుదుర్భేధ్యంగా ఉంది. బౌలింగ్‌లో మరోసారి బుమ్రా కీలకం కానున్నాడు. లక్నో పిచ్‌పై అశ్విన్ బరిలోకి దిగుతాడని భావించినా.. విన్నింగ్ కాంబినేషన్‌నే కొనసాగించే అవకాశాలు ఎక్కువ. అంటే బుమ్రాతో పాటు షమీ, సిరాజ్ పేస్ భారం మోయనున్నారు. జడేజా, కుల్దీప్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. అవసరమైతే ఓ రెండు ఓవర్లు వేసేందుకు కోహ్లీ నెట్స్‌లో తీవ్రంగా శ్రమించిన విషయం తెలిసిందే. ఇక మరోవైపు కాగితంపైన బలంగా కనిపిస్తున్న ఇంగ్లండ్.. మైదానంలో ఆ స్థాయి ప్రదర్శన కొనసాగించాలని తహతహలాడుతున్నది. బెయిర్‌స్టో, మలాన్, రూట్, స్టోక్స్, బట్లర్‌తో కూడిన ఇంగ్లిష్ బ్యాటింగ్ లైనప్‌ను అడ్డుకోకపోతే కష్టమే.

బై బై బంగ్లాదేశ్

నెదర్లాండ్స్ చేతిలో పరాజయం

కోల్‌కతా: వన్డే ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్న బంగ్లాదేశ్.. సెమీస్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. ఈ టోర్నీలో ఇప్పటికే దక్షిణాఫ్రికా వంటి పెద్ద జట్టును ఓడించిన నెదర్లాండ్స్ 87 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన పోరులో డచ్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. మొదట నెదర్లాండ్స్ 50 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (68) టాప్ స్కోరర్ కాగా.. బంగ్లా బౌలర్లలో మెహదీ, ముస్తఫిజుర్, తస్కీన్, షరీఫుల్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో బంగ్లా 42.2 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. మెహదీ హసన్ (35) ఒక్కడే కాస్త పోరాడాడు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మీకెరెన్ 4 వికెట్లు తీశాడు.

నటుడు సుమన్ నుంచి అవార్డులు అందుకుంటున్న రిపోర్టర్లు రవికుమార్, కిరణ్

'నమస్తే' రిపోర్టర్లకు అవార్డులు

ఘనంగా ఐటీ టీవీ గ్లోబల్ మీడియా అవార్డు ఫంక్షన్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఐటీ టీవీ గ్లోబల్ మీడియా మొదటి ఎడిషన్ అవార్డుల కార్యక్రమం టీహబ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి సినీహీరో సుమన్ అవార్డులు ప్రదానం చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక నుంచి స్టేట్ క్రైమ్ బ్యూరో రిపోర్టర్ తోటపల్లి రవికుమార్ 'బెస్ట్ క్రైమ్ రిపోర్టింగ్' విభాగంలో, సిటీ బ్యూరో రిపోర్టర్ కడార్ల కిరణ్ 'బెస్ట్ స్టార్టప్ స్టోరీస్' విభాగంలో అవార్డులు అందుకున్నారు. టీన్యూస్ వీడియో జర్నలిస్టులు భాస్కర్, రాజశేఖర్ కూడా బెస్ట్ క్రైమ్ రిపోర్టింగ్ (ఎలక్ట్రానిక్), బెస్ట్ ఎడ్యుకేషన్, ఎన్టీవీ రిపోర్టర్ రవికుమార్ స్పోర్ట్స్, హెచ్5 రిపోర్టర్ అనిల్ అవార్డు లందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ టీవీ గ్లోబల్ మీడియా నిర్వాహకులు, పాల్గొన్నారు.

మహారాష్ట్రలో వంశీధర్‌రావు జన్మదిన వేడుకలు

హైదరాబాద్, అక్టోబరు 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధరరావు పుట్టినరోజు వేడుకలను ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఫాల్ఘర్ జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచారు. అఖిలభారత ఆదివాసీ ఏక్తా ఫౌండేషన్ తరపున సాగర్ జైన్ ఆశ్రమ విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త రాహుల్ ధాకరే, సహ సమన్వయకర్త శశికాంత్ తివారీ, డహాణు తాలూకా సర్పంచ్, పరిషత్ అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఈసీ అంచనాలకు మించి పనిచేయాలి

- తెలంగాణలో ఎక్సైజ్ తనిఖీలు భేష్
- పొరుగు రాష్ట్రాల అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల వేళ తెలంగాణ ఎక్సైజ్‌శాఖ ముమ్మరంగా చేపడుతున్నట్టు తనిఖీలను పొరుగు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు కొనియాడారు. శనివారం తెలంగాణ, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌కృష్ణలో అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ ఎక్సైజ్ సునీల్‌శర్మ ఐఏఎస్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎక్సైజ్ అధికారుల పనితీరును, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపడుతున్న దాడులను కొనియాడారు. ఎన్నికల సంఘం అంచనాలకు మించి అన్ని రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

హైదరాబాద్‌లో 63.42 లక్షలు సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం పోలీస్ అథారిటీ ద్వారా రూ.63.42 లక్షల నగదు సీజ్ చేయగా, ఇప్పటి వరకు రూ.42.92 కోట్ల నగదును సీజ్ చేసినట్టు ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్స్ ఆయుధాలను 4,463 సేకరించగా, సీఆర్‌పీసీ కింద 637 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 1770 బైండోవర్, 1205 నక్కాస్ ఆపరేషన్స్, 796 నాన్ బెయిలబుల్ వారంట్ నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

- జోడేఘాట్‌లో కుమ్రం భీంకు ఘన నివాళి

కుమ్రంభీం వర్ధంతిని ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం అధికారికంగా నిర్వహించారు. భీం వారసులు, వంశీయులు తమ సంస్కృతి, సంప్రదాయల నడుమ పూజా కార్యక్రమం నిర్వహించి అమర వీరుల జెండాలను ఎగురవేశారు. భీం మనువడు కుమ్రం సోనేరావ్, కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి, ఎస్పీ సురేశ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు భీం విగ్రహం, సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజా దర్బార్ నిర్వహించలేదు.

- కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ)

మహాప్రస్థాన నిర్మాణం అద్భుతం

- మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి అర్ధరాత్రి తనికెళ్ల సందర్శన

సూర్యాపేట, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాప్రస్థానంలో కొలువైన పరమ శివుడిని మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సినీ నటుడు, కవి, రచయిత తనికెళ్ల భరణి సందర్శించారు. భారీ శివుడి విగ్రహాన్ని చూసి పరవశించిపోయారు. సుమారు గంట సేపు శివ చిత్తంలో మునిగితేలారు. శుక్రవారం సూర్యాపేటలో జరిగిన సాహిత్య సభకు తణికెళ్ల భరణి హాజరయ్యారు. ఇందులో మంత్రి జగదీశ్ రెడ్డి నిర్మింపజేసిన మహాప్రస్థానం గురించి కవులు తమ ప్రసంగంలో వివరించారు. మహాప్రస్థానాన్ని చూపించాలని మంత్రిని తనికెళ్ల కోరారు. దీంతో సభ ముగిసిన వెంటనే మంత్రి స్వయంగా ఆయనను మహాప్రస్థానానికి తీసుకెళ్లారు. శ్మశానవాటిక నలుమూలలా తిరుగుతూ మహా అద్భుతం అంటూ జాషువా పద్యాన్ని నెమరువేసుకున్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న మహాప్రస్థానంను చూసి ధన్యోస్మి అంటూ తనికెళ్ల వెనుదిరిగారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ ఇంతటి మహాద్భుత మహాప్రస్థానాన్ని 20 ఏండ్ల క్రితం యూరప్‌లో చూశానని, అక్కడ శ్మశానం ఇరుకుగా ఉన్నదని చెప్పారు. ఆ తర్వాత మొదటి సారిగా అంతటి నిర్మాణాన్ని చూశానని చెప్పారు.

శివుడి విగ్రహం వద్ద మంత్రి జగదీశ్‌రెడ్డి, సినీనటుడు తనికెళ్ల భరణి

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.